వరదనీటి కాలువ పనులను వేగవంతం చేయాలి



వరదనీటి కాలువ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: వరదనీటి కాలువ పనులను వేగవంతం చేయాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అధికారులకు ఆదేశించారు. డివిజన్ పరిధిలోని గాయత్రి ఎన్‌క్లేవ్ నుంచి బొల్లారం ప్రధాన రోడ్డు వరకు రూ.కోటి 50లక్షలతో చేపట్టిన వరదనీటి కాలువ పనులను కార్పొరేటర్ శ్రీకాంత్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని వరద నీటి కాలువ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సునిత, కాలనీ వాసులు తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో లబ్ధి

పటాన్‌చెరు టౌన్: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని మయూరినగర్ కాలనీకి చెందిన భిక్షపతి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఎమ్మెల్యే సహకారంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. చికిత్స నిమిత్తం రెండు లక్షల రూ.50 వేల ఎల్‌ఓసీ మంజూరయింది. ఈ మేరకు గురువారం భిక్షపతి కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ అనుమతి పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు.

ప్రకాశ్‌లాల్‌కు ఘన నివాళి

మణికొండ: భారతీయ యోగా సంస్థాన్ వ్యవస్థాపకుడు ప్రకాశ్‌లాల్ 16వ వర్ధంతిని పురస్కరించుకుని మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్, నేతాజీపార్క్‌లో గురువారం ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు మంజు అగర్వాల్ మాట్లాడుతూ... లక్షలాది మందికి యోగాను నేర్పించి వారి ఆరోగ్యాలను పరిరక్షించాలనే ఉద్దేశంతో ఆయన యోగా సాధనను మొదలు పెట్టారన్నారు. జీవించు, జీవంపచేయి అనే నినాదంతో మొదలు పెట్టిన సంస్థ ప్రస్తుతం 4 వేల మంది సాధక్‌లతో సేవా భావంతో దేశ వ్యాప్తంగా ప్రజలకు ఉచితంగా యోగా నేర్పుతుందన్నారు. కార్యక్రమంలో యోగా టీచర్ సుగుణ, సాధకులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతు

రాజేంద్రనగర్: వర్షం కారణంగా గోతులమయంగా మారిన రోడ్లపై ప్యాచ్ వర్క్‌ను పూర్తి స్థాయిలో నిర్వహించేందుకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌తో పాటు జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి పనులను చేపడుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని ఉప్పర్‌పల్లిలో నిర్వహిస్తున్న ప్యాచ్‌వర్క్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గత వారం కురిసిన వర్షాలకు ప్రధాన రహదారులతో పాటు అంతర్గత బస్తీలలో రోడ్లు గుంతలమయంగా మారాయన్నారు. దీని కారణంగా వాహనదారులతో పాటు పాదచారులు, స్థానిక వ్యాపారస్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో పాటు జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా తక్షణ ప్యాచ్‌వర్క్ పనులను నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన జీహెచ్‌ఎంసీ అధికారులు ప్యాచ్‌వర్క్ పనులను చేపతుండటం అభినందనీయమన్నారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా తాము ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో మాట్లాడి పనులను నిర్వహిస్తున్నామన్నారు.

మైనర్ డ్రైవర్లపై కొరడా

మణికొండ: డ్రైవింగ్ చేసే అర్హత, వయసు లేకుండా ద్విచక్ర వాహనాలను నడుపుతున్న ముగ్గరి వాహనాలను సీజ్ చేశారు. జరిమానాలు విధించటంతో పాటు వారి తల్లిదండ్రులపై నార్సింగి ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. నార్సింగి ట్రాఫిక్ ఎస్ఐలు ఎ.రాజేశ్‌గౌడ్, కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పుప్పాలగూడ బీఆర్‌సీ అపార్ట్‌మెంట్ వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ క్రమంలో అటుగా వాహనాలు నడుపుతూ వచ్చిన ముగ్గురు మైనర్లతో పాటు మరో ఇద్దరు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే వాహనాలు నడుపుతూ వారికి చిక్కారు. దాంతో వారికీ జరిమానాలు విధించటంతో పాటు వారి వాహనాలను సీజ్ చేశారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపైనా మోటారు వాహన చట్టం ప్రకారం కేసులు నమోదు చేశారు. ప్రతి ఒక్కరూ తమ మైనర్ పిల్లలకు వాహనాలను ఇవ్వవద్దని, వాహనాల సరైన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు ఉన్న వారు మాత్రమే వాహనాలను నడపాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

రోడ్లు ఇలా.. ప్రయాణించేదెలా..?

ఐటీ ఉద్యోగుల వాహనాలతో రద్దీగా మాదాపూర్ రోడ్లు

- కొద్దిపాటి వర్షానికే రోడ్లన్నీ గుంతల మయం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు
- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



మాదాపూర్‌లోని చందానాయక్ తండా వద్ద అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు

మాదాపూర్: కొద్దిపాటి వర్షం పడిందంటే చాలు మాదాపూర్ పరిసర ప్రాంతాల్లో ఉన్న రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారుతున్నాయి. ఐటీ ప్రాంతం కావడంతో వాహనాలతో రోడ్లన్నీ రద్దీగా ఉంటాయి. మాదాపూర్‌లోని సాయినగర్, గఫూర్‌నగర్, చందానాయక్ తండా, సర్వే ఆఫ్ ఇండియా తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ వర్షపు నీటితో రోడ్లు ఛిద్రంగా మారుతున్నాయి. వాహనదారులు కార్యాలయాలకు, ఇంటికి వెళ్లడానికి గంటల సమయం పడుతుంది. నాణ్యత లేని రోడ్ల కారణంగా ఎక్కడపడితే అక్కడ గుంతలమయంగా మారుతున్నాయి. స్థానికులు అధికారుకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లు అస్తవ్యస్తం.. నిత్యం ట్రాఫిక్ సమస్య

రోడ్లు అస్తవ్యస్తంగా ఉండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఐటీ ప్రాంతం, అంతర్జాతీయ సదస్సులకు నిలయంగా ఉన్న మాదాపూర్ ప్రాంతంలో ఉన్న రహదారులనే పట్టించుకోవడం లేదంటే మిగిలిన ప్రాంతాల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని, అధికారులు పనితీరు ఇక్కడే కనిపిస్తుందని వాహనదారులు తెలిపారు. రహదారులకు కోట్ల రూపాయలను వెచ్చించి నాణ్యత లేని పనులను చేస్తున్నట్టు తెలిపారు. ప్రణాళికాబద్ధంగా పనులను నిర్వహించి రోడ్లను వేయాలని కోరారు. వాహనదారులకు, పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులను నిర్వహించాలని కోరారు. రోడ్లు వేసిన కొద్ది రోజులకే పాడైపోతున్నాయన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులను వెంటనే చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గుంతల్లో నిలుస్తున్న నీరు..

రోడ్లపై వర్షపు నీటితో గుంతలు నిండిపోవడంతో ఎక్కడ ఏ గుంతలు ఉన్నాయో తెలియక వాహనదారులు, పాదచారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. గుంతలలో నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతున్నాయి. మురికిగా ఉండడంతో ఈగలు, దోమలు ప్రబలి విషజ్వరాల బారిన పడుతున్నట్టు స్థానికులు తెలిపారు. ప్రధాన రహదారులు కావడంతో నిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు జరుగుతుంటాయని ఎప్పటికప్పుడు రహదారులను మరమ్మతులు చేయాలని సీనియర్ సిటిజన్‌లు అధికారులను కోరుతున్నారు.







మాదాపూర్‌లోని సర్వే ఆఫ్ ఇండియాలో..

మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలి



అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, బచ్‌పన్ బచావో ఆందోళన్ ప్రతినిధులు

శేరిలింగంపల్లి: మానవ అక్రమ రవాణాను సమూలంగా నిర్మూలించే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని లింగంపల్లి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీ. బాషా పిలుపునిచ్చారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, గవర్నమెంట్ రైల్వే పోలీసులు, బచ్‌పన్ బచావో ఆందోళన్ సంయుక్తాధ్వర్యంలో లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో ర్యాలీ, అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ..మానవ అక్రమ రవాణా అనేది రోజురోజుకూ పెరుగుతుందన్నారు. మహిళలు, చిన్నారులే లక్ష్యంగా అక్రమ రవాణాదారులు ఉంటారని, ప్రయాణించే సమయంలో వారిని ఒంటరి వదిలిపెట్టవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో బచ్‌పన్ బచావో ఆందోళన్ ప్రతినిధులు నరేష్, ఆశ్రీత, పర్వతాలు, ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ ఎస్. ఆనంద్, జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ ఎస్.రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సింధురెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ వి.సింధురెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం డివిజన్ పరిధిలోని మ్యాక్సొ సైటీ, ఎల్ఐజీ, బొంబాయికాలనీల్లో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణాలను త్వరలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వి.ఆదర్శ్‌రెడ్డి, ఎల్ఐజీ కాలనీ అధ్యక్షుడు యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉడ్ చిప్పర్ యంత్రం ప్రారంభం




యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఉప కమిషనర్ సేవా ఇస్లావత్

కేపీహెచ్‌బీకాలనీ: మూసాపేట సర్కిల్ కేపీహెచ్‌బీ డివిజన్ వసంత్‌నగర్‌కాలనీ సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ఉడ్ చిప్పర్ యంత్రాన్ని సర్కిల్ ఉప కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు పక్కన చెట్ల కొమ్మలు అస్తవ్యస్తంగా ఉండకుండా వాటిని తొలగించి పరిసరాలు శుభ్రంగా ఉంచేందుకు ఈ యంత్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ యంత్రంతో తరిగిన చెట్ల కొమ్మలు మళ్లీ కంపోస్ట్ ఎరువులుగా ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు యూబీడీ సర్కిల్ మేనేజర్ విజయరాణి, విజయశ్రీ, అసోసియేషన్ సభ్యులు యర్రా నాగేశ్వరరావు, కృష్ణమూర్తి, నరసయ్య, వర్మ, రాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.

క్రీడలతో పరిపూర్ణ ఆరోగ్యం

మణికొండ: నిత్యం ప్రజల సమస్యల పరిష్కారానికి, వారికి సకాలంలో సేవలు అందించేందుకు కృషి చేసే మున్సిపల్ సిబ్బంది అప్పుడపుడు క్రీడలు ఆడితే వారికి మానసికోల్లాసంతోపాటు పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీలో పనిచేస్తున్న సిబ్బంది నాలుగు జట్లుగా విడిపోయి వట్టినాగులపల్లిలోని అర్బన్ క్రికెట్ గ్రౌండ్‌లో పోటీపడ్డారు. క్రికెట్ పోటీలను కమిషనర్ ప్రారంభించటంతో పాటు విన్నర్, రన్నర్ జట్లకు కప్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వంద రోజుల ప్రణాళికలతో భాగంగా మున్సిపల్ సిబ్బందికి ఆటల పోటీలను నిర్వహించామన్నారు. ఫైనల్‌లో మేనేజర్ నాగేంద్రబాబు, డీఈ నరేష్‌కుమార్ టీములు పోటీ పడగా అందులో మేనేజర్ టీం విజేతగా నిలవగా డీఈ టీం రన్నర్‌గా నిలిచింది. వారికి కప్‌లను కమిషనర్ అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

మహిళ అదృశ్యం



రేఖ కోల్

మియాపూర్: మహిళ అదృశ్యమైన ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మియాపూర్ న్యూ హాఫీజ్‌పేటలోని మార్తాండ నగర్ కాలనీలో రాజారామ్ కుమార్, రేఖ కోల్(20) 15 ఏళ్లుగా నివాసముంటున్నారు. గత నెల 29న రాజారామ్ కిరాణ దుకాణానికి వెళ్లాడు. 9 గంటల సమయంలో భార్య రేఖ కోల్‌కు ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. వెంటనే ఇంటికి వచ్చిచూడగా ఇంటిదగ్గర భార్య రేఖకోల్ కనిపించలేదు. ఇంటికి తాళం వేసి ఉంది. రాత్రి అయినా భార్య ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో ఎంతవెతికినా ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన రాజారామ్ మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ప్రతి పౌరుడు చట్టాన్ని గౌరవించాలి

మాజీ జడ్జి డాక్టర్ హేమంత కుమార్



పటాన్‌చెరు: ప్రతీ పౌరుడు దేశ చట్టాల పట్ల గౌరవాన్ని కలిగి ఉండాలని లేదంటే కోర్టులో తదనంతర పరిణామాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని మాజీ జిల్లా సెషన్స్ జడ్జి, తెలంగాణ ఎన్నికల సంఘం న్యాయ సలహాదారు డాక్టర్ హేమంత కుమార్ స్పష్టం చేశారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో 'చట్టపరమైన హక్కులు, బాధ్యతలు'పై గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పోక్సో, మాదక ద్రవ్యాలు, ర్యాగింగ్ నిరోధక చట్టాలు, రాజ్యాంగ నిబంధనలు, ప్రాథమిక హక్కులు, బాధ్యతలతో సహా పలు కీలక చట్టాల గురించి విద్యార్థులకు తెలిపారు. న్యాయ సలహా కోరుకునే వారెవరైనా జిల్లా న్యాయ సేవా సంఘం చైర్మన్ లేదా కార్యదర్శికి లేఖ రాసి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని వెల్లడించారు.

కేపీహెచ్‌బీలో చైన్ స్నాచింగ్

కేపీహెచ్‌బీకాలనీ: వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ 3-ఫేజ్‌లోని భువన విజయం గ్రౌండ్స్ వద్ద నివాసం ఉండే చింత శ్యామల (70) గురువారం ఉదయం పాల ప్యాకెట్ కోసం షాపునకు వెళ్లింది. కారులోని ఇద్దరు వ్యక్తులు వచ్చి పేపర్ చూపిస్తూ అడ్రస్ చెప్పాలని హిందీలో అడిగాడు. దీంతో తనకు తెలియదని శ్యామల ముందుకు వెళ్లింది. కారులో వెనకాలే వచ్చిన ఆ వ్యక్తి మళ్లీ శ్యామల వద్దకు వచ్చి ఆమెను కిందకు తోసి మెడలోని బంగారు గొలుసును తీసుకునేందుకు యత్నించగా ప్రతిఘటించింది. దీంతో గొలుసు రెండు ముక్కలుగా తెగిపోగా ఒక ముక్క తీసుకుని దుండగుడు కారు ఎక్కి వెళ్లిపోయాడు. దీంతో బాధితురాలు కేపీహెచ్‌బీ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాయదుర్గం: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. తేజ్ లోహిత్‌రెడ్డి సూచించారు. రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్–హైదరాబాద్ క్యాంపస్‌లో జాతీయ అవయవదాన అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎఫ్‌డీడీఐ సోషల్ అండ్ ఎన్విరాన్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో లీనస్ డయాగ్నస్టిక్స్, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ సంయుక్తాధ్వర్యంలో గురువా రం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ..సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే చదువులో విద్యార్థులు, పనిలో ఉద్యోగులు, సిబ్బంది పూర్తి స్థాయిలో పనిచేయడానికి అవకాశం కలుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులు, ఫ్యాకల్టీ, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి పలు రకాల వైద్య పరీక్షలను నిర్వహించారు. వారికి తగిన సూచనలు చేసి మందులను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎన్‌యూ ఎండీ డాక్టర్ శ్రీకాంత్ గుండ్లపల్లి, కన్సల్టెంట్ డయాబెటిక్స్ డాక్టర్ అబ్దుల్ గఫార్, లీనస్ డయాగ్నొస్టిక్స్ సీఓఓ స్నేహ, పలువురు ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

జేఎన్‌వీ రీజియన్ స్థాయి పోటీల్లో హవేరీ క్లస్టర్ విజేత



చాంపియన్‌గా నిలిచిన హవేరీ క్లస్టర్ జట్టు విద్యార్థులు

రాయదుర్గం: జవహర్‌నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ముగిసింది. ఈ పోటీల్లో నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ స్థాయి విజేతగా హవేరీ క్లస్టర్ నిలిచింది. మూడు రోజులపాటు గోపన్‌పల్లిలోని పీఎంశ్రీ జవహర్‌నవోదయ విద్యాలయ రంగారెడ్డి జిల్లా క్యాంపస్‌లో ఈ వాలీబాల్ రీజియన్ స్థాయి పోటీలను నిర్వహించారు. దక్షిణ భారతదేశానికి చెందిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని జవహర్ నవోదయ విద్యాలయలకు చెందిన 8 క్లస్టర్లు అండర్–14, 17, 19 విభాగాల్లో బాలబాలికల జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఇందులో ఓవరాల్ చాంపియన్‌గా హవేరీ క్లస్టర్ నిలిచింది. ముగింపు సమావేశంలో నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ అభిజిత్ బెహెరా మాట్లాడుతూ..జవహర్ నవోదయ విద్యాలయాల్లో చదువుతోపాటు విద్యార్థులకు క్రీడలు, ఇతర రంగాల్లో రాణించేలా, ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ చక్రపాణి, నేషనల్ లీడర్‌షిప్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ రీజియన్ ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్ నాగభూషణం, విద్యాలయ రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపాల్ విజయభాస్కర్, ఉపాధ్యాయులు, కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



కాలనీలో పర్యటిస్తున్న ఉప కమిషనర్ శశిరేఖ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్: పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ శశిరేఖ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తెలిపారు. డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీ, వీడియా కాలనీలో అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షపునీరు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ కాలనీలోని ఖాళీ ప్రదేశాల్లో వేయకుండా జీహెచ్‌ఎంసీ ఆటో రిక్షా వారికే అందజేయాలన్నారు. వర్షకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ నాగిరెడ్డి, డీఈ దుర్గా ప్రసాద్, శానిటేషన్ సూపర్ వైజర్ శ్రీనివాస్, సీవో లక్ష్మీ, ఎంటమాలజీ ఏఈ చిన్నా రమావత్, శానిటేషన్ ఎస్ఆర్‌పీ, ఎస్ఎఫ్ఏ, కాలనీవాసులు తదితరులున్నారు.

తురంకుంటలో వ్యర్థ జలాలు ప్రవాహం



తురంకుంటలో ప్రవహిస్తున్న వ్యర్థజలాలు

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం పట్టణ పరిధిలోని తురంకుంట గండి కాల్వలో కాలుష్య జలాలు పారుతున్నాయి. గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని పలు పరిశ్రమలు బుధవారం కురిసిన వర్షం నీటితో కలిపి రసాయన వ్యర్థ జలాలు తురంకుంటలోకి వదిలారు. ఎర్రటి రంగులోని నీరు భారీగా కాల్వల ద్వారా వదిలారు. దీంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్థ్యజలాలు మల్లం చెరువులోకి చేరడంతో చెరువు కలుషితం అవుతుందని, వర్షాకాలం ప్రారంభంలోనే ఇలాంటి పరిస్థితులు నెలకొంటే రానురాను తీవ్రస్థాయికి చేరే ప్రమాదం ఉందని ఆ ప్రాంత రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పీసీబీ అధికారులు నిర్లక్ష్యం వదిలి పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

'మహిళా సాధికారత'పై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మహిళలు

నిజాంపేట్: మున్సిపల్ కార్పొరేషన్ భవ్యస్ ఆనంద్ గేటెడ్ కమ్యూనిటీలో మహిళా సాధికారత, అభివృద్ధి అవగాహన సదస్సు గురువారం జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు, ఉమెన్స్ సేఫ్టీ వింగ్స్, మహిళా సాధికారిక అభివృద్ధి సంస్థ నిర్వాహకులు సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానిక మహిళలకు అవగాహన కల్పించారు. ప్రధానంగా గృహ హింస, కుటుంబ కలహాలు రాకుండా సూచనలు, ఒకవేళ తలెత్తితే పరిష్కారాలను వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ భాస్కర్ రెడ్డి, డాక్టర్ మోదులే, బాచుపల్లి ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ సంధ్య, ప్రోగ్రాం మేనేజర్ వీ అనూష, భవ్యస్ ఆనందం నిర్మాణ సంస్థ సీతారాం, అధ్యక్షురాలు రమణి, బాచుపల్లి సీడీఈడబ్ల్యూ ఫ్యామిలీ కౌన్సెలింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలకు మరమ్మతు చేయించండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నేతలు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల భద్రత కోసం రూ. 1.20 కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఎక్కువ శాతం పనిచేయటం లేదని, వాటికి వెంటనే మరమ్మతులు చేయించాలని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ నాయకులు, బీజేపీ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి కె.శివరాంరెడ్డి కోరారు. ఈ మేరకు వారు వేరువేరుగా మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్ కుమార్‌ను కలిసి వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ యువత అధ్యక్షుడు ఎస్. శ్రీకాంత్, ప్రచార కార్యదర్శి ఎ.లక్ష్మణ్‌రావు, బీజేపీ ప్రధాన కార్యదర్శి శివరాంరెడ్డి మాట్లాడుతూ... ఇటీవల శ్రీరాంనగర్ కాలనీలో ఆటో ప్రమాదం, పైప్‌లైన్ రోడ్డులో నీటి ట్యాంకర్ ప్రమాదాలు జరిగినా మున్సిపాలిటీ నుంచి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలలో రికార్డు కాలేదన్నారు. ఆయా సంఘటనల్లో ఎవరి తప్పు అని తెలుసుకునేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చిందన్నారు. ఇకనైనా సీసీ కెమెరాలు సరిగా పనిచేసేలా మరమ్మతులు చేయించాలని కమిషనర్‌ను కోరామన్నారు. నాయకులు కె.ప్రవీణ్, తిరుపతి, కిరణ్, బాబురావు, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.